చెక్కుల అందజేత

సికింద్రాబాద్: అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారికి మెరుగైన వైద్యం చేయించేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చెప్పారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పద్మారావుగౌడ్ శనివారం అందించారు. కార్యక్రమంలో మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, బీఆర్ఎస్ నాయకులు సుంకు రాంచందర్, వైపీ బాలాజీ, పాక సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల కవితా గానంతో ఆకట్టుకున్న కవి సురేందర్

లాలాపేట: తెలంగాణ ఇదరహే ఆదాబ్ ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతీలో నిర్వహించిన కవి సమ్మేళనంలో సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పగిడిపల్లి సురేందర్ పాల్గొని ఆంగ్లంలో కవితా గానం చేశారు. మీలాదున్నబీ సల్లలాహు అలైహి వసల్లం' అనే అంశంపై సురేందర్ చేసిన కవితాగానానికి ముగ్దులైన నిర్వాహకులు ఆయనను అభినందించారు. నంది అవార్డు గ్రహీత సాధనల వెంకటస్వామి, కీర్తి పురస్కార గ్రహీత రఘువీర్ ప్రతాప్ సురేందర్‌ను శాలువాతో సత్కరించి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి యలమర్తి అనురాధ, గిడుగు శాంతికృష్ణ, సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ రషీద్, సాహిత్యవేత్తలు నాశేశ్వరం శంకర్, అన్వర్ పాషా తదితరులున్నారు.

బేగంపేట ఇన్‌స్పెక్టర్‌గా పి.సైదులు

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పి.సైదులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ప్రసాదరావు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తించిన సైదులును బేగంపేట ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ నగర కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన చార్మినార్ డీఐగా, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించి, ప్రస్తుతం బేగంపేట ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

భగత్‌లాల్‌కు ఓయూ డాక్టరేట్



లాలాపేట: భగత్‌లాల్ గట్లకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఓయూ భూ విజ్ఞాన శాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ శ్రీను కున్సోత్ పర్యవేక్షణలో రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా ఎంకూరు ప్రాంతంలోని అనోర్థోసైట్లు అనుబంధ గబ్రో శిలల పెట్రాలజీ– భూ రసాయన శిలలు అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ పరీక్షల విభాగం పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందజేసింది. రాష్ట్ర భూశాస్త్ర పరిశోధన ఖనిజ వనరుల అవగాహన, భూగర్భ నిర్మాణం చారిత్రిక అభివృద్ధిని అర్థం చేసుకోవడానికి భగత్‌లాల్ పరిశోధన దోహదపడుతుంది.

టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేత



సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా అత్యంత ప్రతిష్టాత్మకమైన టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు–2025ను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజిమెంట్ శ్రీశక్తి గెలుచుకుంది. హాస్పిటాలిటీ విభాగంలో అందించిన ఈ అవార్డును శనివారం శిల్పారామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఐహెచ్ఎం శ్రీశక్తి యాజమాన్యం మాట్లాడుతూ.. ఆతిథ్య రంగంలో తమకు ఈ అవార్డు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ



బౌద్ధనగర్: తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని బౌద్ధనగర్ దుకాణ యజమానుల సంఘం నిర్వహించారు. ఈ సందర్భంగా – బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రవిప్రసాద్‌గౌడ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాయిప్రసాద్‌గౌడ్, ఎస్. శ్యామ్ కుమార్, ఉపేందర్, బాబు, హర్షద్, జ్ఞానేశ్వర్, రాజు, బాబురావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలలితాంబిక నమోస్తుతే..



హనుమాన్ ఆలయంలో లలితాత్రిపురసుందరీ దేవిగా..

దేవీ శరన్నవరాత్రి మహోత్సవలను పురస్కరించుకొని అంతటా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. అమ్మవారి ఆలయ పరిసరాలు ఓం శ్రీమాత్రే నమః అంటూ మార్మోగుతున్నాయి. రోజుకొక అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాదిగా తరలివస్తున్న భక్తులతో ఆలయాలు కిక్కిరిస్తున్నాయి. ఆయా ఆలయాల్లో ప్రతిరోజూ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం



బల్కంపేటలో లలితాదేవీగా అమ్మవారు



మహాలక్ష్మీ దేవిగా కనకదుర్గ అమ్మవారు



సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలో శ్రీలలితాదేవిగా..



పార్వతీదేవిగా బేగంపేట ప్రకాష్‌నగర్ భూలక్ష్మి అమ్మవారు



తార్నాకలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి



గర్భగుడిలో గాజులతో అలంకరించిన బల్కంపేట రేణుకాఎల్లమ్మ



బేగంపేట శ్రీకట్టమైసమ్మ ఆలయంలో శ్రీభువనేశ్వరిదేవిగా అమ్మవారు



రాజరాజేశ్వరీదేవి ఆలయంలో లక్ష పుష్పార్చన



కట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం సతీమణి నందిని



బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్



అడ్డగుట్ట: అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



లాలాపేట పోచమ్మ దేవాలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు, నాయకులు



శ్రీచక్రపీఠం ధ్యాన మందిరంలో అమ్మవారి పూజల్లో భక్తులు

మెరుగైన వసతులు కల్పించాలి

అడ్డగుట్ట: యూపీహెచ్‌సీలో మెరుగైన వసతులు కల్పించేలా అధికారులు కృషి చేయాలని బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు గెల్లు ఉదయ్ యాదవ్ అన్నారు. శనివారం తుకారాంగేట్ బోయబస్తీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీలో సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఉదయ్‌యాదవ్ మాట్లాడుతూ.. బోయబస్తీ కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న యూపీహెచ్‌సీ రోగులకు చాలా అసౌకర్యంగా ఉందని, దీంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు సౌందర్య, సాయన్న, చింటూ, శివాజీ, హంసరాజు, స్వామి, శ్యామ్, శ్రీకాంత్ చారి, రాజారం, వసంత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జిల్లా సాధన సమితి బీసీ సెల్ అధ్యక్షుడిగా మహేందర్‌యాదవ్

సికింద్రాబాద్: లష్కర్ జిల్లా సాధన సమితి బీసీ సెల్ అధ్యక్షుడిగా మెట్టుగూడకు చెందిన సామాజిక కార్యకర్త ర్యాల మహేందర్‌యాదవ్ నియమితులయ్యారు. ఆయనను బీజీ విభాగం అధ్యక్షుడిగా నియమిస్తున్నట్టు జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ప్రకటించారు. శనివారం మెట్టుగూడలో జిల్లా సాధన సమితి సమావేశంలో మహేందర్‌కు పవన్‌కుమార్‌గౌడ్ నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి బాలరాజ్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు ముత్యాల గీత, ప్రతినిధులు శైలేందర్,సునీల్ ముదిరాజ్, కృష్ణ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



పనుల పరిశీలన

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆదేశించారు. తుకారాం గేట్ రియోపాయింట్ హోటల్ వద్ద జరుగుతున్న డ్రైనేజీ మరమ్మతు పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ.. అడ్డగుట్ట ఈ– సెక్షన్ మజీద్, ఆర్‌ఆర్‌సీ మైదానం పరిసర ప్రాంతాల్లో, అడ్డగుట్ట చౌరస్తా నుంచి తుకారం గేట్ పోలీస్ స్టేషన్ వైపు వెళ్లే దారిలో నిత్యం డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వాటికి తక్షణమే శాశ్వత పరిష్కారాన్ని చూపేలా చర్యలు తీసుకోవాలని జలమండలి డీజీఎం విద్యా సాగర్, ఏఈ స్రవంతిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, ఎల్లయ్య, దేవయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలుబోగీ నుంచి జారిపడి యువకుడి మృతి

సికింద్రాబాద్: నడుస్తున్న రైలు నుంచి జారిపడిన ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు శనివారం మృతి చెందాడు. సికింద్రాబాద్ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరాజు వివరాల మేరకు చర్లపల్లి రైల్వే స్టేషన్–సింగపూర్ డబుల్ బెడ్రూం కాలనీ మధ్యలో ఒక యువకుడి మృతదేహం పడిఉందని పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు వేగంగా వచ్చిన రైలు బండి నుంచి ప్రమాదవశాత్తు జారిపడి సదరు యువకుడు మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి వివరాలు పోలీసులకు లభించలేదు. సుమారు 25 ఏళ్ల వయసు కలిగిన మృతుడి ఒంటిపై ఎరుపు రంగు, ఎరుపు నలుపు రంగుగల నిండు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ఉన్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వివరాల కోసం 87126 58581 నంబరు ద్వారా తమను సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.



మృతి చెందిన గుర్తు తెలియని యువకుడు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం

బన్సీలాల్‌పేట్: రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ప్రతినిధులు పలువురు పేద మహిళలను సత్కరించారు. దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని శ్రీ పెద్దమ్మ దేవాలయంలో పెద్ద ఎత్తున పూల వ్యాపారం, కొబ్బరికాయలు ఇతరత్రా చిల్లర వర్తక వ్యాపార చేసుకునే మహిళలను సత్కరించారు. దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా సదరు మహిళలను చీరలతో సత్కరించినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ అధ్యక్షురాలు రోటేరియన్ నీరజ గొడవర్తి, రోటేరియన్ ఎస్‌జీకే మోహన్‌లు చెప్పారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షురాలు రోటేరియన్ నీరజ గొడవర్తి మాట్లాడారు.



మహిళలను సత్కరించిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

లొంగిపోయిన నక్సల్స్‌కు ఉపాధి కల్పించాలి

లాలాపేట: లొంగిపోయిన నక్సల్స్‌ను ఆదుకొని వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సామాజిక విప్లవకారుడు డా. ప్రేమ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు లొంగిపోయిన నక్సల్స్ అందరూ ఆరోగ్యంగా పూర్తిగా బలహీనంగా ఉండటంతో పాటు ఆర్థికంగా క్షీణ దశలో ఉన్నారని పేర్కొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో పసికందును వదిలివెళ్లిన మహిళ



గాంధీఆస్పత్రి: గాంధీ ఆస్పత్రిలో ఓ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. గాంధీ అవుట్ పేషెంట్ విభాగంలో శనివారం ఉదయం ఓ మహిళ సుమారు 6 నెలల వయసున్న పసికందును అక్కడున్న ఓ జంటకు అప్పగించి, అర్జెంట్ పని ఉంది పది నిమిషాల్లో వస్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయింది. గంటల సమయం గడిచినా.. సదరు మహిళ రాకపోవడంతో ఆ జంట ఏం చేయాలో తెలియక అయోమయానికి గురయ్యారు. చివరికి సదరు చిన్నారిని గాంధీ ఆస్పత్రి సిబ్బందికి అప్పగించి వెళ్లిపోయారు. పసికందు ఆరోగ్యం బాగా లేకపోవడంతో సిబ్బంది పీడియాట్రిక్ వార్డ్‌లో అడ్మిట్ చేశారు. వైద్యుల పర్యవేక్షణలో చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి అధికారుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు.

ప్రశాంతంగా ఓయూలో ఎన్నికలు

నేడు ఉదయం ఓట్ల లెక్కింపు

లాలాపేట: ఓయూలోని ఉద్యోగ సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్‌జీవోస్ స్టాఫ్ అసోసియేషన్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్, ఎంప్లాయిస్ యూనియన్ ఉన్నాయి. కాగా ఎంప్లాయిస్ యూనియన్‌కు ఏకగ్రీవంగా జరిగాయి. దీంతో ఆ యూనియన్‌కు ఎన్నికలు నిర్వహించలేదు. మిగతా రెండు యూనియన్లకు 14 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు నిర్వహించారు. ఎన్‌జీఓస్ స్టాఫ్ అసోసియేషన్‌లో మొత్తంగా 583 ఓట్లు ఉండగా, ఇందులో 552 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్‌లో 330 మంది ఉద్యోగులు ఉండగా, 308 మంది ఉద్యోగులు ఓటు వేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఓయూ పాలనా భవనం, ఆర్ట్స్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవం

సనత్‌నగర్: బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ వేడుకలకు ట్రావెల్ ఏజెన్సీలు, రాష్ట్ర పర్యాటక విభాగం ఔట్‌లెట్లు, ఇతర పర్యాటక సంబంధిత టూరిజం ప్రమోటర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధికి ట్రావెల్ ఏజెన్సీలు, ఇతర భాగస్వాముల మధ్యక్రమం తప్పని సంబంధాలు, పరస్పర సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు చేయాలి

సనత్‌నగర్: సద్దుల బతుకమ్మకు ఘనమైన ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 30న కర్బలా మైదానంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ ఏర్పాట్లపై ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మొబైల్ జనరేటర్లను అందుబాటులో ఉంచాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో బన్సీలాల్‌పేట కార్పొరేటర్ హేమలత, మాజీ కార్పొరేటర్లు అరుణగౌడ్, మల్లికార్జున్‌గౌడ్, డీసీ డాకూనాయక్, డీఈ మహేష్, శానిటేషన్ డీఈ వెంకటేష్, వాటర్‌వర్క్స్ డీజీఎం ఆశిష్, ఎలక్ట్రికల్ డీఈ దుర్గాప్రసాద్, ఆర్ అండ్ బీ ఈఈ మోహన్, లేక్స్ డీఈ గణేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

కిమ్స్ ఆస్పత్రిలో ప్రపంచ గుండె దినోత్సవం

సనత్‌నగర్: కిమ్స్ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన ప్రపంచ గుండె దినోత్సవంలో టాలీవుడ్ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హాజరై సందడి చేశారు. గుండె సమస్యలను జయించి పీడియాట్రిక్ వారియర్లుగా నిలిచిన చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులను ఈ సందర్భంగా ఆయన సత్కరించారు. అనంతరం కిమ్స్ కడల్స్ సికింద్రాబాద్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ బాబు ఎస్.మదార్కర్ మాట్లాడుతూ... పిల్లలకు ఏవైనా గుండె సమస్యలుంటే అవి పుట్టుకతోనే బయటపడతాయన్నారు. గుండె సమస ్యతో పుడితే పిల్లలు బతికేందుకు చాలా సమస్యలు ఉంటాయన్నారు. వాళ్ల శరీరం నీలంగా అయిపోతుందన్నారు. గుండె నుంచి శరీర భాగాలకు తగినంతగా రక్తం సరఫరా కాదని, దాంతో చాలా అనిశ్చితి ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ కార్డియాక్ ఇన్సెంటివిస్ట్ నాగరాజన్, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుధీఫ్‌వర్మ, పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కిమ్స్ ఆస్పత్రిలో చిన్నారులతో సినీ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్

అమీర్‌పేట: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బైక్‌థాన్ నిర్వహించారు. సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కళాశాల, పంజగుట్ట ట్రాఫిక్ పోలీసుల సహకారంతో మీ హృదయ ఆరోగ్యాన్ని తెలుసుకోండి అనే థీమ్‌తో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఈఓ డా.హరికుమార్‌రెడ్డి మాట్లాడారు.



కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో మహిళా ఉద్యోగులు

బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దంగా నిలిచే ఈ ఉత్సవాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని పండుగ విశిష్టతను చాటుతున్నారు. – సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం



హిందూ పబ్లిక్ స్కూల్‌లో..



సనత్‌నగర్: జెక్‌కాలనీ వనమాల రెసిడెన్సీ వద్ద బతుకమ్మ వేడుకల్లో మహిళలు



బతుకమ్మ వేడుకల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద